# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-07-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **నూతన నేర చట్టాలు అత్యాధునిక నేర న్యాయ వ్యవస్థకు దోహద పడతాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.**
2. **ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడంలో ప్రభుత్వ ఉద్యోగుల సహకారం ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో 'స్టాప్ డయేరియా' అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు.**
4. **తెలంగాణ వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తెలిపింది.**
5. **సివిల్స్ ప్రిలిమ్స్-2024 పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది.**
6. **ఈరోజు ప్రపంచ క్రీడా పాత్రికేయుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

============================

నూతన నేర చట్టాలు అత్యాధునిక నేర న్యాయ వ్యవస్థకు దోహదపడతాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. నిన్న అమలులోకి వచ్చిన నూతన చట్టాల గురించి ఢిల్లీలో ఆయన పాత్రికేయులకు వివరిస్తూ... కొత్త చట్టాలు సత్వర న్యాయానికి, బాధితుల హక్కులకు భరోసా కల్పిస్తాయని తెలిపారు. న్యాయ వ్యవస్థ ఇప్పుడు పూర్తిగా 'స్వదేశీమయిందని, ఫిర్యాదుదారుల హక్కులు పరిరక్షించేందుకు ఈ నూతన చట్టాలు దోహదపడతాయని తెలిపారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు వ్యతిరేకంగా కొత్త నిబంధనలతో రాజ ద్రోహ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని, దీని స్థానంలో దేశ ద్రోహ చట్టం ప్రవేశ పెట్టిందని హోంమంత్రి తెలిపారు. కొత్త చట్టాల్లో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్క రోజులోనే 95 శాతం పైగా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి నెలలోనే ఒకేరోజులో 95 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేయడంపై అధికార యంత్రాంగాన్ని, ఇంటింటికీ పింఛన్ పంపిణీలో నేరుగా పాల్గొన్న గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. సమన్వయంతో

పనిచేస్తే ఉద్యోగులు అద్భుతంగా పనిచేయగలరు అనేది పింఛన్ల పంపిణీతో మరోసారి రుజువు అయ్యిందని అన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ అభినందనలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీర్చడంలో ప్రభుత్వ ఉద్యోగుల సహకారం ప్రభుత్వానికి ఎంతో అవసరం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

--------------------------

విభజన సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 6న హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లవుతోందని, విభజన చట్టం అమల్లో భాగంగా పరిష్కారం కాని అంశాలు ఇంకా ఉన్నాయన్నారు. వీటికి సామరస్యపూర్వక పరిష్కారం సాధించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖాముఖి చర్చల ద్వారా కీలక అంశాలను పరిష్కరించుకునేందుకు వీలుంటుందన్నారు. ఇరు రాష్ట్రాల్లో సుస్థిర ప్రగతి సాధించడానికి.. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అవసరమని ప్రజల అభ్యున్నతికి దోహదపడేలా.. ఉమ్మడి లక్ష్యాలను సాధించేందుకు చర్చలు కీలకమని లేఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

--------------------------

బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో కఠిన శిక్షలు విధించేందుకు భారతీయ న్యాయ సంహిత చట్టం దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు అన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిన్న అమరావతిలోని హైకోర్టులో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై నిన్నటి నుంచి అమల్లోకి వచ్చిన నూతన నేర చట్టాల గురించి న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరస్థులను సంస్కరించే విధంగా కొత్త చట్ట నిబంధనలు ఉన్నాయన్నారు. బీఎన్ఎస్‌లో సుమారు 14 నుంచి 15 కొత్త సెక్షన్లను ప్రవేశపెట్టారని తెలిపారు. సమాజ అవసరాలకు అనుగుణంగా చట్టాలు మారుతుంటాయని, న్యాయవాదులు వాటిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అతిసార వ్యాధి పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నిన్న అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 'స్టాప్ డయేరియా' రాష్ట్ర స్థాయి ప్రారంభ కార్యక్రమంలో మంత్రి పాల్గొని అతిసార ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆరోగ్యశాఖకు చెందిన పలు అంశాలపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రెండు నెలల పాటు 'స్టాప్ డయేరియా' అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆరోగ్య వసతుల్లో సరైన నిర్వహణ, స్వచ్ఛమైన నీటిని అందుబాటులోకి తేవడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, సురక్షితమైన తాగునీరు అందించడం వంటి కార్యక్రమలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

ఆకాశవాణి సంస్కృత బులెటిన్ ప్రసారం ప్రారంభమై గత నెల 30వ తేదీతో 50 సంవత్సరాలు పూర్తి

చేసుకుంది. ఈ సందర్భంగా ఆకాశవాణి కుటుంబాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించారు. సంస్కృతాన్ని మన దైనందిన జీవితంతో అనుసంధానించడం నేటి కాలానికి అవసరమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. కాగా.. ఆకాశవాణి సంస్కృత వార్తలు 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన "వందే సంస్కృత మాతరం" ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తెలిపింది. ఇటీవలే హైదరాబాద్ విజయవాడ మధ్య పది ఎలక్ట్రిక్ బస్సులను ప్రయోగాత్మకంగా నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.కొత్తగా 450ఎలక్ట్రిక్ బస్సులు రాష్ట్రానికి రానున్నాయని, దశలవారీగా ఈ బస్సులను పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, సూపర్ లగ్జరీ విభాగాలలో నడుపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

---------------------------

సివిల్స్ ప్రిలిమ్స్-2024 పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ -యూపీఎస్సీ నిన్న విడుదల చేసింది. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపింది. ఈ ఏడాది సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షను జూన్ 16వ తేదీన దేశవ్యాప్తంగా యూపీఎస్సీ నిర్వహించగా. మొత్తం 400 మార్కులతో అన్ని అబ్జెక్టివ్ ప్రశ్నలతో రెండు పేపర్లగా ఈ పరీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా 14 వేల 627 మంది ప్రధాన పరీక్షకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ నుంచి 42 వేల 560 మంది ప్రాథమిక పరీక్షకు హాజరయ్యారు. ఈ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సెప్టెంబర్ 20వ తేదీ నుంచి మెయిన్స్ పరీక్షలు ప్రారంభంకానున్నాయని యూపీఎస్సీ తెలిపింది.

---------------------------

ఈరోజు ప్రపంచ క్రీడా పాత్రికేయుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. క్రీడా రంగ వార్తలను ప్రజలకు అందజేయడానికి క్రీడా పాత్రికేయులు చేస్తున్న కృషిని గుర్తించి... వారి పని తీరు మరింత మెరుగు పడేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1924వ సంవత్సరం జులై 2వ తేదీన ప్యారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో అంతర్జాతీయ స్పోర్ట్స్ ప్రెస్ అసోసియేషన్‌ను స్థాపించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. అయితే... ప్రపంచ క్రీడా పాత్రికేయుల దినోత్సవాన్ని 1994 సంవత్సరంలో ప్రకటించారు.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలియజేసింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులుకురిసే అవకాశముందని పేర్కొంది. ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశముందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ద్రోణి ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

---------------------------

తెలంగాణలో త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. నిన్న హైదరాబాద్‌లో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, మంత్రి వర్గ విస్తరణతో పాటు పలువురు మంత్రుల శాఖల్లోనూ మార్పులు చేర్పులు ఉంటాయన్నారు. కొత్తగా ఐదారుగురికి మంత్రివర్గంలో చోటుదక్కే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

---------------------------

తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాసరాజు నియమితులయ్యారు. మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారుగా ఆయనను నియమిస్తూ ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు తెలంగాణలోని ఎనిమిది మంది ఐపీఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. వీరిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగూడెం ప్రత్యేక అధికారిగా పరితోశ్ పంకజ్, ములుగు ప్రత్యేక అధికారిగా మహేష్ బాబా సాహెబ్, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, గవర్నర్ ప్రత్యేక అధికారిగా సిరిశెట్టి సంకీర్త్ లను బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

=====================